# 90 కాస్ట్యూమ్స్‌లో గూఢచారి



కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డెవిల్'. స్వీయ దర్శకనిర్మాణంలో అభిషేక్ నామా తెరకెక్కిస్తున్నారు. ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. పీరియాడిక్ డ్రామాగా రూపొందిస్తున్న ఈ చిత్రంలో కల్యాణ్‌రామ్ సీక్రెట్ బ్రిటీష్ ఏజెంట్ పాత్రలో కనిపించనున్నారు. గూఢచారి పాత్రలో ఆయన నటించడం ఇదే తొలిసారి. ఈ సినిమాలో కల్యాణ్‌రామ్ 90 రకాల కాస్ట్యూమ్స్‌తో కనిపిస్తారని డిజైనర్ రాజేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 'ఈ స్క్రిప్ట్ వివరించగానే హీరో లుక్స్ డిఫరెంట్‌గా ఉండాలని అర్థమైంది. ఇందులో హీరో భారతీయుడు. అయినా బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా పనిచేస్తుంటాడు. ఆయన పాత్రను ఎలివేట్ చేసేలా కాస్ట్యూమ్స్ డిజైన్ చేశాను. కొన్ని దుస్తుల్లో అచ్చమైన భారతీయత కనిపిస్తుంది' అని తెలిపారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సౌందర్‌రాజన్, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు: శ్రీకాంత్ విస్సా, నిర్మాత, దర్శకత్వం: అభిషేక్ నామా.



# సలార్ ఇక సంసిద్ధం

**ఎప్పుడెప్పుడా** అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'సలార్'ది మొదటిస్థానం. ప్రభాస్, ప్రశాంత్‌నీల్ కలయికలో వస్తున్న ఈ పాన్ ఇండియా యాక్షన్ డ్రామా ఈ నెల 22న విడుదల కానుంది. ఆదివారం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి ఏ సర్టిఫికెట్ జారీ అయ్యింది. యాక్షన్ పార్ట్ ఎక్కువ కావడమే ఏ సర్టిఫికెట్ రావడానికి కారణమని తెలుస్తున్నది. మరో విషయం ఏంటంటే.. ఈ సినిమా నిడివి 2 గంటల 55 నిమిషాలట. ' 'సలార్' కథను రెండున్నర గంటల్లో చెప్పలేం.. ఇది సంపూర్తిగా చెప్పాలంటే మినిమమ్ అయిదు గంటలైనా పడుతుంది. అందుకే రెండు భాగాలుగా తీస్తున్నాం' అని ప్రశాంత్‌నీల్ గతంలో చెప్పారు. ఇప్పుడు తొలి భాగమే 2గంటల 55 నిమిషాలు రావడం ఫిలింవర్గాల్లో చర్చనీయాంశమైంది. సినిమా నిడివి ఎంతున్నా బావుంటే జనం బ్రహ్మరథం పడతారనేది నిజం. దానికి గతంలో చాలా సినిమాలను ఉదాహరణగా చెప్పొచ్చు. రీసెంట్ బ్లాక్‌బాస్టర్ 'యానిమల్' కూడా 3 గంటల 26 నిమిషాలు. ఏది ఏమైనా 'సలార్' పాన్ ఇండియా రికార్డులను తిరగరాయడం ఖాయమని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు.





నాగార్జున, ఆషికా రంగనాథ్

# ఎత్తికెళ్లిపోవాలనిపిస్తుంది..

నాగార్జున నటిస్తున్న పూర్తిస్థాయి మాస్ చిత్రం 'నా సామి రంగ'. విజయ్ బన్నీ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. శ్రీనివాస్ చిట్టూరి నిర్మాత. ఆషికా రంగనాథ్ కథానాయిక. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ సినిమాకు చెందిన పాటను ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. ఎం.ఎం.కీరవాణి స్వరపరచగా, చంద్రబోస్ రాసిన 'ఎత్తికెళ్లిపోవాలనిపిస్తుంది..' అంటూ సాగే ఈ గీతం యువతరం ప్రేక్షకులను గిలిగింతలు పెట్టేలా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ పాటతో 'నా సామిరంగ' సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ ఘనంగా ప్రారంభమయ్యాయని, ఆస్కార్ విజేతలైన కీరవాణి, చంద్రబోస్‌ల సంగీత సాహిత్యాలు ఈ సినిమాకు ప్రధానబలంగా నిలువనున్నాయని, ముఖ్యంగా ఈ పాటను రామ్ మిరియాల అద్భుతంగా ఆలపించాడని, నాగ్, కీరవాణి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన ఆల్బమ్స్‌కి ఏమాత్రం తగ్గని స్థాయిలో ఈ ఆల్బమ్ కూడా ఉండనుందని నిర్మాత చెప్పారు. ప్రమోషన్స్‌లో రగ్గ్‌డ్‌గా కనిపిస్తున్న నాగార్జున, ఈ పాటలో చాలా హ్యాండ్సమ్‌గా అలరిస్తారని, ఇక ఆషికా ట్రెడిషనల్ లుక్‌తో ఆకట్టుకుంటుందని, ఈ పాట ఆడియన్స్‌కి విజువల్ ఫీస్టేనని దర్శకుడు చెప్పారు. ప్రసన్నకుమార్ బెజవాడ కథ, మాటలు అందిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ: పవన్‌కుమార్. నిర్మాణం: శ్రీనివాస్ సిల్వర్‌స్క్రీన్.

# ఇది పూర్తిగా కొత్త కథ



చిరంజీవిని డైరెక్ట్ చేయడం చాలా మంది దర్శకుల కల. కానీ చిరంజీవి మాత్రం అందరికీ షాకిస్తూ, ఒకేఒక్క సినిమాను డైరెక్ట్ చేసిన యువదర్శకుడు మల్లిడి వశిష్ఠకు అవకాశం ఇచ్చేశారు. కల్యాణ్‌రామ్‌తో వశిష్ఠ చేసిన 'బింబిసార' మంచి హిట్. అయితే, ఒక్క హిట్‌తో ప్రతిభను అంచనా వేయలేం. కానీ చిరంజీవి మాత్రం మరో ఆలోచన చేయకుండా వశిష్ఠకు భారీ అవకాశం వచ్చేశారు. మెగాస్టార్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు వశిష్ఠ అహర్నిశలూ శ్రమిస్తున్నాడని టాక్. చిరంజీవితో ఆయన చేస్తున్న చిత్రానికి 'విశ్వంభర' టైటిల్ ఖరారు చేశారు. టైటిల్‌తోనే మార్కులు కొట్టేశారు వశిష్ఠ. సోషియో ఫాంటసీ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సాయిమాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్న విషయం తెలిసిందే. సినిమా ప్రకటన వెలువడ్డ దగ్గర్నుంచి అనేకమైన రూమర్లు వినిపిస్తూనే వున్నాయి. అయిదుగురు హీరోయిన్లని, హీరో ముల్లోకాలు తిరిగొస్తాడని, ఆ సినిమాకు సీక్వెల్ అని, ఈ సినిమాకు ప్రీక్వెల్ అని చాలా రూమర్లు మీడియాలో హల్‌చల్ చేశాయి. అయితే.. వాటన్నింటికీ ఒక్క సమాధానంతో తెరదించేశాడు వశిష్ఠ. 'ఈ సినిమా గురించి వినిపిస్తున్న వార్తల్లో నిజంలేదు. ఇది పూర్తిగా కొత్త కథ. ఇందులో మెగాస్టార్, అభిమానులు కోరుకున్నట్టే కనిపిస్తారు. దానితోపాటు నేను అనుకున్న ఫాంటసీ మాత్రమే ఉంటుంది.' అని సింపుల్‌గా తేల్చేశాడు.

# 'తంత్ర' రహస్యం




అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'తంత్ర'. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకుడు. నరేష్‌బాబు, రవిచైతన్య నిర్మాతలు. ఇటీవల ఈ చిత్ర టీజర్‌ను నటుడు ప్రియదర్శి విడుదల చేశారు. 'ఊరిలో పుట్టిన దుష్టశక్తి రక్తదాహంతో విరుచుకు పడుతున్నది..' అనే డైలాగ్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం ఉత్కంఠను పంచింది. దుష్ట శక్తి బారిన పడిన అమ్మాయిగా అనన్య విభిన్నమైన పాత్రలో కనిపించింది. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రస్తుతం హారర్ సినిమాల ట్రెండ్ నడుస్తున్నది. క్షుద్రపూజలు, రక్త పిశాచాలు ఇతివృత్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఫస్టులుక్‌కు మంచి స్పందన లభిస్తున్నది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం.' అన్నారు. ధనుష్ రఘుముద్రి, సలోని, టెంపర్ వంశీ, మీసాల లక్ష్మణ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాయిరామ్ ఉదయ్, విజయ్ భాస్కర్ సుద్దాల, సంగీతం: ఆర్.ఆర్.ధృవన్.



# అభిమానికి సర్‌ప్రైజ్

నేషనల్ క్రష్ రష్మిక మందన్నకు దేశవ్యాప్తంగా అభిమాగణం ఉంది. 'పుష్ప' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చుకున్న ఈ అమ్మడు.. తాజా చిత్రం 'యానిమల్'తో యువతరానికి మరింతగా చేరువైంది. సోషల్‌మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ అమ్మడు తాజాగా తన వీరాభిమాని ప్రమోద్ భాస్కర్‌తో వీడియో కాల్ ద్వారా ముచ్చటించింది. అందుకు బిగ్‌బి అమితాబ్ బచ్చన్ హోస్ట్ చేస్తున్న 'కౌన్ బనేగా కరోడ్‌పతి' రియాల్టీ షో వేదికైంది. రష్మిక మందన్నను సోషల్‌మీడియాలో ఫాలో అవుతున్నాడు ప్రమోద్. ఆమె సినిమాలపై విశ్లేషణలు కూడా చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో రష్మిక మందన్నతో మాట్లాడాలనుందనే తన కోరికను అమితాబ్ ముందుంచాడు ప్రమోద్. దీంతో అమితాబ్.. రష్మికకు ఫోన్ చేసి ప్రమోద్‌తో మాట్లాడించాడు. తన అభిమాన నాయిక వీడియో కాల్‌లో మాట్లాడటంతో ఒక్కసారిగా సర్‌ప్రైజ్ అయ్యాడు ప్రమోద్. 'మిమ్మల్ని ఎంతగానో అభిమానిస్తున్నా. ఓసారి వ్యక్తిగతంగా కలిసి మాట్లాడాలనుంది' అని ప్రమోద్ అడగ్గా.. అందుకు సరేనని బదులిచ్చింది రష్మిక మందన్న. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'యానిమల్' సినిమాలో రష్మిక అభినయం చాలా బాగుందని అమితాబ్ బచ్చన్ సైతం ప్రశంసలు కురిపించారు.

# స్నేహానికి 'హద్దు లేదురా'




ఆశిష్‌గాంధీ, అశోక్, వర్ష, హ్రితిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'హద్దు లేదురా'. రాజశేఖర్ రావి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వీరేష్ గాజుల నిర్మిస్తున్నారు. టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ దర్శకుడు క్రిష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన సినిమా థీమ్ వైవిధ్యంగా ఉందన్నారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'అలనాటి కృష్ణార్జునులు స్నేహితులైతే ఎలా ఉంటారో తెలిపే చిత్రమిది. కథ, కథనాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయి. త్వరలో టీజర్‌ను విడుదల చేస్తాం' అన్నారు. స్నేహం గొప్పతనాన్ని ఈ తరం వారికి తెలియజెప్పేలా ఈ సినిమా కథ ఉంటుందని హీరో ఆశిష్‌గాంధీ పేర్కొన్నారు.

# వచ్చే నెలలో కొత్త హంగామా షురూ?



***ఆ రోజుల్లో ఎన్టీఆర్, కృష్ణ*** *సినిమాలు నెలకు ఒకటి చొప్పున విడుదలయ్యేవి. ఆమాటకొస్తే నెలకు రెండుమూడు సినిమాలు విడుదలైన దాఖలాలు కూడా ఉన్నాయి. చిరంజీవి, బాలకృష్ణ కూడా ఏడాదికి నాలుగైదు సినిమాలు చేసేవాళ్లు. ఇప్పటి హీరోలు ఏడాదికి ఒక సినిమా చేయటమే గొప్ప. అయితే హీరో నానిని మాత్రం అందులో మినహాయించాలి. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ మొదలుపెట్టిన నాని 'అష్టాచెమ్మా'తో హీరోగా మారి 15ఏళ్లు. ఈ పిరియడ్‌లో 30కి పైగా సినిమాల్లో హీరోగా చేసేశాడు. అంటే రమారమి ఏడాదికి రెండు సినిమాల చొప్పున చేశాడన్నమాట. ఈ విషయంలో నానిని ఎవరైనా అభినందించాల్సిందే. ఈ స్పీడ్‌ని నేటికీ నాని కొనసాగిస్తూనేవున్నాడు. ఉదాహరణకు నాని నటించిన 'హాయ్ నాన్న' ఈ మధ్యే విడుదలైంది. ఆ సినిమా వేడి చల్లారకముందే తను నటిస్తున్న 'సరిపోదా శనివారం' సినిమా కూడా విడుదలకు రెడీ అయ్యిందని సమాచారం. వచ్చే నెలలోనే ఈ సినిమాను విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. నానితో 'అంటే సుందరానికి' లాంటి ఫీల్‌గుడ్ మూవీని తీసిన వివేక్ ఆత్రేయ దర్శకుడు కావడంతో సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. ఎస్.జె.సూర్య కీలక పాత్ర పోషిస్తున్నాడు. జేక్స్ బెజాయ్ సంగీత దర్శకుడు. ఏదేమైనా.. సినిమాలు వేగంగా చేస్తూ, ఎంతోమంది సినీ కార్మికులకు పని కల్పిస్తున్న నానీని నిజంగా మెచ్చుకోవాల్సిందే.*

# 'యానిమల్' రికార్డు కలెక్షన్స్



రణ్‌బీర్‌కపూర్, రష్మిక మందన్న జంటగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కించిన 'యానిమల్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ కలెక్షన్స్‌తో దూసుకుపోతున్నది. విడుదలైన తొమ్మిది రోజుల్లోనే ఈ చిత్రం 660 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. ఈ ఏడాది ఈ కలెక్షన్స్ మార్కును దాటిన నాలుగో సినిమాగా నిలిచింది. పఠాన్, జవాన్, గదర్-2 చిత్రాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. మరో పది రోజుల్లో ఇవే స్థాయి కలెక్షన్స్ రాబడితే వెయ్యి కోట్ల మార్క్‌ను దాటడం సులభమేనని బాలీవుడ్ ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రణ్‌బీర్‌కపూర్ టెర్రిఫిక్ పర్‌ఫార్మెన్స్, సందీప్ రెడ్డి వంగా స్టైలిష్ మేకింగ్, రొమాంచితమైన యాక్షన్ ఎపిసోడ్స్ ఈ సినిమా విజయానికి ప్రధాన కారణాలు. 'అర్జున్ రెడ్డి' తర్వాత దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా మరో కల్ట్ మూవీని అందించాడని ప్రశంసలొస్తున్నాయి.

# నాకు క్వాంటిటీ కంటే క్వాలిటీ ముఖ్యం

హీరోయిన్ నేహాశెట్టి.. తన పేరుతో కంటే 'డీజె టిల్లు రాధిక'గానే ఎక్కువ పాపులారిటీ సంపాదించింది. ఆ సినిమా ఆమెపై చూపించిన ఇంపాక్ట్ అలావుంది మరి. ప్రస్తుతం అంతా నేహాని 'రాధిక..' అనే పిలుస్తున్నారు. యువతరంలో ఈ అమ్మడి క్రేజ్ మామూలుగా లేదు. అంత క్రేజ్ ఉన్నప్పటికీ సినిమాలు మాత్రం అరకొరగానే చేస్తున్నది నేహాశెట్టి. దీనిపై ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చిందామె. 'నాకు క్వాంటిటీ కంటే క్వాలిటీ ముఖ్యం. నిజానికి చాలా ఆఫర్లు వస్తున్నాయి. నేనే అంగీకరించడంలేదు. కథ, పాత్ర బాగుండకపోతే చేయను' అని నిర్మొహమాటంగా చెప్పింది నేహా. ఇంకా చెబుతూ ' నాకు యాక్టింగ్ అంటే పిచ్చి. మంచి నటిగా గుర్తింపు తెచ్చుకోవాలి. గుర్తుండిపోయే పాత్రలు చేయాలి. ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోవాలి. కేవలం డబ్బుకోసమే నేను హీరోయిన్‌ని కాలేదు. నాకంటూ కొన్ని లక్ష్యాలు, నియమాలు ఉన్నాయి. ఏదిపడితే అది చేసేసి కెరీర్‌ని పాడుచేసుకోవడం నాకిష్టంలేదు. కెరీర్‌కి లాంగ్విటీ ఉండాలంటే, చేసే పాత్రలు మంచివి అయ్యుండాలి. అయినా నేనేం ఖాళీగా లేను. న్యూయార్క్ ఫిలిం అకాడమీలో 4 నెలలపాటు యాక్టింగ్ కోర్స్ చేసి వచ్చాను. నటిగా నాకు నేను మెరుగుపరచుకునే పనిలోఉన్నాను. మార్చి 8న మా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' విడుదల కానుంది. అందులో నా పాత్ర పేరు బుజ్జి. తప్పకుండా అందర్నీ ఆకట్టుకునే పాత్ర అవుతుంది.' అంటూ చెప్పుకొచ్చింది నేహాశెట్టి.